ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





అది కడప నగరంలో కీలకమైన రాజారెడ్డివీధి. ఇక్కడే పోలీసు పెట్రోలు బంకు ఉంది. ఈ రోడ్డులోనే నెహ్రూ పార్కుతో పాటు చెన్నై వెళ్లే రహదారి వస్తుంది. అంటే కడప ఎస్పీ బంగ్లా నుంచి జిల్లా గ్రంథాలయం వరకు ఈ రహదారి మంచి బిజినెస్ సెంటర్. ఈ ఏరియా అంతా వ్యాపారులకు అడ్డా. ఎలక్ట్రానిక్స్ షోరూమ్స్ మొదలుకుని హోటల్స్, జిమ్‌లు, బ్యాంకులు, కేక్స్ ఇలా ఎన్నో ఉన్న అడ్డా ఇది. ఇక్కడ బిజినెస్ కోసం సెంటు స్థలం దొరికినా బంగారుగా భావిస్తారు. అలాంటి ఏరియాలో అదీ 30 సెంట్ల స్థలం.. అందులోనూ సుమారు రూ.12కోట్ల విలువ చేసే స్థలం కనిపిస్తే ఊరుకుంటారా.. అది కూడా జగన్ పాలనలో.. అందులోనూ కడప కార్పొరేషన్‌లో నెంబర్-2 అని చలామణి అవుతున్న వ్యక్తి. ఆయన కన్ను పడ్డం ఆలస్యం వ్యూహాత్మకంగా పావులు కదిపి బినామీ పేరుతో సొంతం చేసుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో టీడీపీలో ముఖ్యులకూ 4 గదులు ఇచ్చి నోరెత్తకుండా చేశారని ప్రచారం సాగుతోంది.

రూ.12 కోట్ల స్థలం వైసీపీ నేతలపరం

- చక్రం తిప్పిన కార్పొరేషన్ పాలకవర్గం నెంబర్-2 వ్యక్తి
- న్యాయస్థానంలో ఉన్న స్థలాన్ని పోలీసు సంఘం మాటున కట్టబెట్టిన వైనం
- సహకరించిన కార్పొరేషన్, రెవెన్యూ సిబ్బంది
- వారికి నజరానా
- విషయం బయటకు పొక్కడంతో.. మీకు 4 మాకు 4 అంటూ.. టీడీపీ నేతలకు ఆఫర్



బినామీ పేరుతో వైసీపీ నేత దక్కించుకున్న పోలీసు శాఖ స్థలంలో సాగుతున్న నిర్మాణాలు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రాజారెడ్డి వీధిలో పోలీస్‌పెట్రోలు బంకుకు ఆనుకుని ఖాళీ స్థలం ఉంది. ఇది పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించింది. ఆ స్థలంపై కార్పొరేషన్ పాలకవర్గంలో నెంబర్-2గా ఉన్న వైసీపీ నేత కన్నుపడింది. ఆయనకు వైసీపీ అనే పవర్‌తో పాటు తాను సొంతంగా ఏదైనా చేయగల దిట్ట అంటారు. అందుకే చాకచక్యంగా కడపలో కరుడుగట్టిన వైసీపీ అండ్ కోకు తెలియకుండానే వ్యూహాత్మకంగా రూ.12కోట్ల విలువ చేసే 30 సెంట్ల స్థలాన్ని కాజేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఆ స్థలం వివాదంలో ఉన్నప్పటికీ అప్పటి పోలీసు బాస్‌ను మేనేజ్ చేసి మరీ ఒప్పందం చేసుకుని అక్కడ తనదైన స్టైల్‌లో నిర్మాణాలు సాగించారంటారు. కాలం కలిసిరాకపోతే తాడే పామై కరుస్తుంది అన్నట్లు.. ప్రభుత్వం మారి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఇప్పుడు పోలీసు లైను పక్కన లీజు వ్యవహారం బట్టబయలైంది. న్యాయస్థానంలో వివాదంలో ఉన్న స్థలాన్ని అప్పటి పోలీసు బాస్ గుట్టుచప్పుడు కాకుండా ఓ వైసీపీ నేత బినామీకి కట్టబెట్టిన వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పుడు ఆ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో విశేషమేమంటే అనుమతి లేకండా నిర్మాణాలు చేపట్టడం అటుంచితే.. ఎలాంటి డాక్యుమెంట్లు లేని స్థలానికి ట్యాక్స్ వేసి కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు తమ ఉడతా భక్తిని చాటుకోవడం మరో విశేషం.

రూ.12 కోట్ల స్థలం

కడప నగరంలోని ఎస్పీ బంగ్లా నుంచి రాజారెడ్డివీధి మీదుగా, నెహ్రూపార్కు నుంచి జిల్లా గ్రంథాలయానికి వెళ్లే రహదారి హాట్‌కేక్ లాంటిది. ఇక్కడ ఇప్పటికే హోటల్స్, ఎలక్ట్రానిక్స్ రకరకాల వాణిజ్య సంస్థలు ఉన్నాయి. ఇది జనం సేదతీరేందుకు కాస్త ప్రశాంతమైన ఏరియాగా ఉంటుంది. అయితే ఇదే ప్రాంతంలో పోలీసుసంక్షేమం కోసం పెట్రోలు బంకు నిర్వహిస్తున్నారు. దాని పక్కన నాగరాజుపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 270లో కొంత భూమి ఉంది. అందులో కొంత స్థలం కోర్టులో నడుస్తోందంటారు. అయితే ఇక్కడ ఓ 30 సెంట్ల స్థలాన్ని ఓ పోలీసుబాస్ ఫుడ్‌కోర్టుకు కట్టబెట్టడం.. అదీ 2023 మార్చిలో కట్టబెట్టడం తీవ్ర దుమారం రేపుతోంది.

సాధారణంగా ఏదైనా స్థలం లీజుకు ఇచ్చేటప్పుడు గుర్తింపు ఉన్న, సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు యాడ్స్ ఇస్తారు. అయితే అప్పటి పోలీసు బాస్ పరిచయం లేని పత్రికకు యాడ్ ఇవ్వడంతో పాటు అప్పటి ప్రభుత్వాన్ని భజన చేసే పత్రికకు ప్రకటన రూపంలో ఇచ్చారని చెబుతారు. కార్పొరేషన్‌లో నెంబర్-2గా చెలామణి అవుతున్న వైసీపీ నేతకు స్థలాన్ని కట్టబెట్టేందుకే ఆ బాస్ అప్పట్లో అలా చేశారని సమాచారం. మళ్లా వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అనే ధైర్యంతో అడ్డగోలుగా స్థలానికి డాక్యుమెంట్లు లేకుండానే ఒప్పందం కుదుర్చుకున్నారని అంటున్నారు. బినామీ పేరుతో ఆ స్థలం పొందిన సదరు వైసీపీ నేత టౌన్ ప్లానింగ్ అనుమతి లేకుండానే నిర్మాణాలు మొదలు పెట్టారు. ఆయన వైసీపీలో కీలక నేత కావడంతో కార్పొరేషన్ అధికారులు కూడా అడ్డుకోలేదని చెబుతున్నారు. ఇందులో విశేషమంటే ఖాళీ స్థలానికి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ వేసి కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు తమ ఉడతాభక్తిని చాటుకున్నారు. ఏదైనా స్థలానికి వీఎల్‌టీ వేయాలంటే ఆ భూమికి సంబంధించి రిజిస్టరు డాక్యుమెంట్లు, పత్రాలు ఉండాలి. సహజంగా మా స్థలం ఖాళీగా ఉంది, దీన్ని ఎవరైనా కబ్జా చేస్తారు, మా వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయి, వీఎల్‌టీ వేయండి మహాప్రభో.. అని మొత్తుకున్నా అధికారులు అంత త్వరగా పట్టించుకోరు. అయితే వివాదాస్పదంగా ఉన్న ఈ స్థలంపై ఈ నెల 10న అప్లై చేస్తే వెంటనే వీఎల్‌టీ ట్యాక్స్ వేయడం గమనార్హం. అంటే ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండానే వీఎల్‌టీ వేయడం చూసి ఔరా.. అంటూ నగర జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

మీకు 4 మాకు 4

పోలీసు స్థలంలో కట్టడాల వ్యవహారం కడపలో హాట్‌టాపిక్‌గా మారింది. అనుమతి లేకండా వివాదాస్పద స్థలంలో కట్టడాల గురించి తెలుసుకుని వైసీపీ కార్పొరేటర్లే కొందరు అవాక్కవుతున్నారు. "ఏంది.. ఈ స్థలం ఇంత వివాదాస్పదమవుతుందా.. అంత కళ్లు మూసుకుని అగ్రిమెంట్లు చేసుకున్నారా.. ఇది టీడీపీ గవర్నమెంటు.. మావాడికి (నెంబర్ 2కు) మాంచి సినిమా ఉంటుంది" అని పలువురు కార్పొరేటర్లు భావించారంటారు. అయితే ప్రత్యర్థి రెండాకులు చదివితే తాను నాలుగాకులు చదువుతాడని పేరున్న నెంబర్-2 ఆ స్థలం దక్కించుకునేందుకు మాస్టర్ ప్లాన్ వేశారంటారు. కడప టీడీపీలో ఇప్పుడు కీరోల్‌గా ఉంటూ ఈ స్థలాన్ని ఇష్యూ చేసిన వారికి బంపర్ ఆఫర్ ఇచ్చారని అంటున్నారు. ఇక్కడున్న రూముల్లో మీకు 4 ఇస్తాను, నేను 4 తీసుకుంటాను, ఈ ఇష్యూ ఇక్కడితో వదిలేయండంటూ కొందరు టీడీపీ నేతలతో అంతర్గత ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పుడు ఈ రూ.12 కోట్ల స్థలం వ్యవహారం అటు టీడీపీ, ఇటు వైసీపీలో హాట్‌టాపిక్‌గా మారింది. మా వాడు వైసీపీ అయినా సరే.. టీడీపీ నేతలతో మేనేజ్ చేసి మావాడి మార్కు చూపించాడంటున్న వైసీపీ నేతలను చూసి.. టీడీపీ నేతలు మేం అలాంటోళ్లం కాదని అనలేక ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోలేక గొంతులో పచ్చివెలక్కాయ పడ్డవారిలా గిలగిలలాడుతున్నారని సమాచారం.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు

- వచ్చే నెల 15లోపు పంపిణీకి ఆదేశం
- జిల్లాలో 30వేల మందికి పైగా లబ్ధి
- నాలుగేళ్లుగా ఆపేసిన వైసీపీ ప్రభుత్వం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 19: ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు నాలుగేళ్ల తరువాత మళ్లీ ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగులు ఇవ్వనున్నారు. వచ్చే నెల 15లోపు పంపిణీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2013-14 విద్యాసంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేపట్టింది. రాష్ట్ర విభజన అనంతరం 2014-15 నుంచి 2018-19 విద్యాసంవత్సరం వరకు టీడీపీ ప్రభుత్వం కూడా దీన్ని కొనసాగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదటి సంవత్సరం మాత్రమే ఉచిత పుస్తకాలు ఇచ్చి అనంతరం నిలిపివేసింది. ఇటీవల విద్యాశాఖమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన నారా లోకేశ్ వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు ఇవ్వని విషయం తెలుసుకుని విస్మయం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో ఇంటర్ చదువుతున్న 30 వేల నుంచి 35 వేలమంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. విద్యార్థులు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు బయట కొనుగోలు చేయాలంటే సుమారు రూ.2వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ ఏడాది నుంచి ఆ భారం తగ్గనుంది. జిల్లాల వారీగా ఎవరికి ఎన్ని పుస్తకాలు కావాలో ఇండెంట్ పంపించాలని ఇంటర్ విద్య కార్యదర్శి ఆర్ఐవోలను ఆదేశించినట్లు సమాచారం. వచ్చే నెల రెండో వారంలోపు పుస్తకాలు జిల్లాకు సరఫరా అయ్యే అవకాశం ఉంది.

సికిల్ సెల్ అనీమియాపై ప్రత్యేక చర్యలు

- డీఎంఅండ్ హెచ్ఓ

కడప(కలెక్టరేట్), జూన్ 19: సాఫీగా సాగే రక్తకణాలకు ఇబ్బంది కలిగించి, అనేక వ్యాధులకు గురి చేసే సికిల్ సెల్ అనీమియా జన్యుపరంగా సంక్రమించే వ్యాధి అని.. ప్రత్యేక చర్యలతో దీనిని అంతమొందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పిలుపు నిచ్చారు. బుధవారం ఎర్రముక్కపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో 'పీఎం జన్మాన్- మినిస్టర్ జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఎక్కువగా ట్రైబల్ ఏరియాల్లో ఉందని, అక్కడ ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షల ద్వారా నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ఇది జన్యు సంబంధ వ్యాధి అని, అతి కొద్ది మందికి మాత్రమే సంక్రమిస్తోందన్నారు. ఈ వ్యాధి సోకితే ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలోకి మారి రక్త కణాల ప్రసరణకు అడ్డు పడుతుందన్నారు. దీంతో అనేక రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. రక్త పరీక్షల ద్వారా దీనిని గుర్తించాల్సి ఉంటుందన్నారు. వ్యాధి గ్రస్తులకు రక్తం ఎక్కించడం, బోన్ మారో చికిత్స, స్టెమ్ సెల్ చికిత్స ద్వారా మాత్రమే నివారించ వచ్చన్నారు. ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స, నెలకు రూ.10 వేలు పెన్షన్ కూడా ఇస్తారన్నారు. ఈవ్యాధిని 2047 నాటికి సమూలంగా నిర్మూలన చేయాలని భారత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, ఆర్‌బీఎస్ ఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేశ్, డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ రియాజ్ అహమ్మద్, జిల్లా మలేరియా అధికారి మనోరమ, డిప్యూటీ డెమూ రమణమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు సీఐలు, ఎస్ఐల బదిలీ

కడప (క్రైం), జూన్ 19: జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలు, ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ కౌశల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. కర్నూలు జిల్లా ఎస్‌హెచ్‌ఆర్‌సీలో పనిచేస్తున్న బి.రామక్రిష్ణను కడప వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. కడప వన్‌టౌన్‌లో పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డిని కర్నూలు రేంజ్ వీఆర్‌కు, ప్రొద్దుటూరు రూరల్‌లో పనిచేస్తున్న రమణారెడ్డిని ఖాజీపేటకు, ఖాజీపేటలో పనిచేస్తున్న రామాంజులును కర్నూలు వీఆర్‌కు, ఆదోని వన్‌టౌన్‌లో పనిచేస్తున్న తేజ్‌మూర్తిని కడప చిన్నచౌకుకు ఇక్కడ పనిచేస్తున్న పి.నరసింహారెడ్డిని కర్నూలు వీఆర్‌కు బదిలీ చేశారు. అలాగే ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న కంభగిరి రాముడును సీపీఎస్ కర్నూలుకు బదిలీ చేశారు. ప్రొద్దుటూరు రూరల్‌లో పనిచేస్తున్న ఎస్ఐ కె.చిరంజీవిని మైదుకూరుకు, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జైచంద్రశేఖర్‌ను బ్రహ్మంగారిమఠం, బి.మఠంలో పనిచేస్తున్న ఎస్ఐ విద్యాసాగర్‌ను కడప వీఆర్‌కు, ప్రొద్దుటూరు రూరల్‌లో పనిచేస్తున్న ఎస్ఐ బి.శివప్రసాద్‌ను దువ్వూరుకు, దువ్వూరులో పనిచేస్తున్న శ్రీనివాసులును కడప వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కాకా పడుతున్నారు..

గుణశేఖర్ నిర్మించిన రుద్రమదేవి సినిమా గుర్తుందా... అందులో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఒక డైలాగ్ చెబుతాడు. అక్కడా ఉంటా.. ఇక్కడా ఉంటా అంటాడు. ఈ సినిమా వచ్చిన కొత్తల్లో రాష్ట్ర విభజన జరిగింది. ఏపీ నాదే, తెలంగాణ నాదే అనే విధంగా అప్పటి డైలాగ్‌ను కొందరు అన్వయించుకున్నారు. ఇప్పుడు అదే డైలాగ్ రిపీట్ అవుతోంది. ఇదేదో తెలంగాణ, ఆంధ్రాకు సంబంధించిన విషయం కాదు. సార్వత్రిక ఎన్నికలు జరిగాక కూటమి అధికారంలోకి రావడం.. చంద్రబాబు సీఎం కావడంతో వైసీపీ నేతలంతా మేము మీకే ఓట్లు వేశామంటూ ఎమ్మెల్యేలకు బొకేలు ఇస్తూ కలుస్తున్నారు. అంతటితో ఆగలేదు.. వీరు వైసీపీకి కొమ్ముకాచిన ఉద్యోగులను, అధికారులను సైతం తీసుకెళ్లి.. వీరంతా టీడీపీకే పనిచేశారని చెబుతున్నారు. మళ్లీ వైసీపీనే వస్తుందని వన్‌సైడ్‌గా పనిచేసిన ఉద్యోగులు ప్లేటు ఫిరాయించి టీడీపీ ఎమ్మెల్యేలను కలుస్తుండడం తీవ్ర దుమారం లేపుతోంది.

- జగన్ పాలనలో వైసీపీకి వన్‌సైడ్ చేసిన వైనం
- ప్రభుత్వ ఉద్యోగులమని మరిచి బరితెగింపు
- మళ్లీ జగనే సీఎం అని అత్యుత్సాహం
- వైసీపీ మటాష్ కావడంతో...
- మేం మీకేం చేశామంటూ టీడీపీ ఎమ్మెల్యేలను కలుస్తున్న వైనం
- ప్రస్తుతం ఉన్నచోటే కొనసాగేందుకు యత్నం

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో టీడీపీకి అనుకూలురనే ముద్రతో పలువురు ఉద్యోగులను బదిలీచేస్తే కొందరిని ఏకంగా విధుల నుంచే తొలగించేశారు. ఉద్యోగులపరంగా చంద్రబాబు ఎంతో మేలు చేశారు. అయినా కొందరు జగన్ వైపే ఉన్నారు. జిల్లాలో కొందరు అధికారులు వైసీపీకి వన్‌సైడ్‌గా కొమ్ముకాశారంటారు. పోలీసు సంఘం మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్ ఫ్యామిలీకి అనుకూలంగా ఉంటారనే పేరుంది. నిన్నటి వరకు కూడా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారంటారు. పోలీసు అధికారుల అసోసియేషన్ వైఎస్ ఫ్యామిలీకి అనుకూలంగా ఉండేదంటారు. అయితే.. ఇప్పుడు చంద్రశేఖర్‌రెడ్డి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డిలను కలవడం చర్చనీయాంశంగా ఉంది. నిన్నటి దాకా వైసీపీతో అంటకాగిన బ్యాచ్ ఇపుడు టీడీపీ నేతలను కలవడం చూసి టీడీపీ హార్డ్‌కోర్ ఫ్యాన్స్ హర్ట్ అవుతున్నారు.

ఇక జిల్లా పరిషత్ పాలక వర్గం వైసీపీ చేతిలో ఉంది. గతంలో ఏ పాలక వర్గం ఉన్నప్పటికీ అధికారులు తమ పరిధి దాటి ప్రవర్తించేవారు కాదు. అయితే జగన్ పాలనలో అధికారులు రూల్స్ దాటి వైసీపీని భుజాన వేసుకున్నారనే విమర్శ ఉంది. నో రూల్స్, నో గైడ్‌లైన్స్. మాదంతా వైసీపీనే అనే విధంగా ప్రవర్తించారు. జిల్లా పరిషత్ అధికారులైతే టీడీపీ వారిని గుర్తుపెట్టుకొని మరీ ఇబ్బంది పెట్టారంటారు. టీడీపీకి అనుకూలంగా ఉన్నవారిని ముప్పుతిప్పలుపెట్టారు. ఇప్పుడు అదే బ్యాచ్ టీడీపీ భజన చేయడమే చర్చనీయాంశంగా మారింది. జిల్లాపరిషత్‌కు చెందిన నాగిరెడ్డి, మల్లేశ్వరరెడ్డి లు వైసీపీకి కరుడుగట్టిన అభిమానులుగా ముద్ర ఉంది. ప్రభుత్వం మారింది. అయినా వారు అక్కడే కొనసాగేందుకు టీడీపీ ఎమ్మెల్యేలను కలవడం చర్చనీయాంశంగా మారింది. సర్వశిక్ష అభియాన్ ప్రభాకర్‌రెడ్డి కడపలోనే మకాం వేసేందుకు టీడీపీ నేతలను కలవడం హాట్‌టాపిక్‌గా మారింది.

ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కొందరు నేతలు.. వైసీపీకి వన్‌సైడ్‌గా వ్యవహరించిన అధికారులను వీళ్లు మనోళ్లే అక్కడ ఉన్నా కూడా మనకే చేశారంటూ ఎమ్మెల్యేకి పరిచయం చేసి మళ్లీ ప్రస్తుతం ఉన్నచోటే కొనసాగించేలా చూస్తుండడం టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. నిన్నటి దాకా ఎన్నో కష్టాలు అనుభవించాం.. మళ్లీ ఇప్పుడు వారిదే రాజ్యమైతే ఎలా అని టీడీపీకి అనుకూలురైన ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు సీఎం అయి రెండు వారాలు కాకముందే మళ్లీ వైసీపీ అండ్‌కోసే పెత్తనం చేయడం చూసి పలువురు టీడీపీ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం మారినా.. పెత్తనం వారిదే..!

- సలహాదారుల పేరుతో రిటైర్డ్ ఉద్యోగుల నియామకం
- పదోన్నతులు, బదిలీల్లో వారు చెప్పిందే వేదం
- పాలకవర్గం పోయినా కొనసాగుతున్న వైనం
- టీడీపీ నేతల ప్రసన్నం కోసం యత్నం
- డీసీసీ బ్యాంకు అధికారుల అసహనం


కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 19: వారంతా దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. పదవీ విరమణ వయసు రావడంతో ఇళ్లకు పరిమితం అయ్యారు. కానీ గత ప్రభుత్వ హయాంలో వచ్చిన డీసీసీబీ పాలకవర్గం సలహాదారుల పేరుతో పదవీ విరమణ పొందిన అధికారుల్లో కొందరిని తిరిగి బ్యాంకులో నియమించుకున్నారు. వీరికి గౌరవ వేతనాలతో పాటు బ్యాంకు నిర్వహణపై అనధికారికంగా అధికార బాధ్యతలు అప్పగించారు. దీంతో బ్యాంకు అధికారులు వీరి కనుసన్నల్లో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇటీవల వైసీపీ ఘోరంగా ఓడిపోయి టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో.. డీసీసీబీ పాలకవర్గాలు తమ పదవులకు రాజీనామా చేశాయి. సలహాదారులు మాత్రం అలాగే కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారడంతో టీడీపీకి చెందిన నాయకులు డీసీసీబీ అధికార పాలకవర్గాలుగా ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. ఈ తరుణంలో తిరిగి తాము సలహాదారులుగా కొనసాగేందుకు కొంతమంది ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకులను కలిసి వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వాలు మారినా సలహాదారులు బయటకు కదిలేలా లేరని, బ్యాంకును వదిలేలా లేరంటూ బ్యాంకులోని అధికార వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఏ పార్టీ వచ్చినా..

తమను నియమించుకునే సమయంలో చేసుకున్న ఒప్పందం మేరకు మూడేళ్లపాటు సలహాదారులుగా కొనసాగే అవకాశం ఉందంటూ రిటైర్డ్ అధికారులు బ్యాంకు ఉద్యోగుల వద్ద చెబుతున్నట్లు సమాచారం. ఏ పార్టీ వచ్చినా తమ సామాజిక వర్గానికి సంబంధించిన నేతలే జిల్లాలో ప్రాధాన్యత గల వ్యక్తులుగా ఉంటారని ఏదోరకంగా తమకు బంధువర్గం ఉంటుంది కాబట్టి తిరిగి సలహాదారులుగా తామే ఉంటామంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. గత పాలకవర్గం సూచనల మేరకు వీరు రుణాల మంజూరులో వైసీపీ నేతలకు మేలు చేసినట్లు బ్యాంకు వర్గాలు గుసగుసలాడుతున్నాయి. గత పాలకవర్గం ఏ విధంగా అయితే తమను ఉపయోగించుకున్నదో అదే రీతిలో మీకు కూడా ఉపయోగపడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని టీడీపీ నేతల వద్ద వీరు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.



డీసీసీ బ్యాంకు



సలహాదారుని గుప్పెట్లో బ్యాంకు

పదోన్నతులు.. బదిలీల్లో వారిదే పెత్తనం

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు, సిబ్బంది పదోన్నతులు బదిలీల్లో సలహాదారులదే పెత్తనం సాగుతోందని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. రుణాల మంజూరులో నిబంధనలు పాటిస్తూ పనిచేస్తున్న సిబ్బందిపై సలహాదారులు కన్నెర్ర చేసేవారని, వారు చెప్పిన పని చేయకపోతే బదిలీ తప్పదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఇటీవల సొసైటీల్లోని సిబ్బందికి బ్యాంకు ఉద్యోగాల్లో అవకాశం కల్పించే క్రమంలో లక్షల రూపాయలు చేతులు మారినట్లు సమాచారం. ఇందులో సలహాదారుల్లోని ఒక వ్యక్తి ప్రధాన పాత్ర పోషించినట్లు ప్రచారం సాగింది. పీఐసీ కమిటీ కూడా ఈయన చెప్పిందే వేదంగా భావించే వారని చర్చ నడుస్తోంది. ప్రస్తుతం బ్యాంకులో ఉన్నతాధికారులు ఉన్నప్పటికీ వారికి ఎలాంటి అధికారాలు లేకుండా సలహాదారులు పూర్తిగా బ్యాంకును తమ ఆధీనంలో ఉంచుకుని తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతులు, ఉద్యోగ నియామకాల్లో వీరే నిర్ణయాలు తీసుకుని బ్యాంకును నిర్వహిస్తున్నారని అంటున్నారు.

ఈ సలహాదారులు చేసే పనులను ఎవరైనా అధికారులు కాదంటే వారిని తొలగించే వరకు వీరు ఊరుకోరు. ఇందుకు నిదర్శనం.. గతంలో పనిచేసిన రఘునాధరెడ్డి, భాస్కర్‌రెడ్డి పదవీకాలం పూర్తికాక ముందే వీరిని బ్యాంకు నుంచి పంపించడంలో సలహాదారుని పాత్ర చాలా ఉంది. తనకు జీతం ఎంత కావాలో తానే నిర్ణయించుకుని బోర్డు మీటింగ్‌లో అప్రూవల్ చేసుకుని తీసుకునే వరకు వచ్చిందంటే ఈయన బ్యాంకును తన గుప్పెట్లో ఎలా పెట్టుకున్నాడో అర్థమవుతుంది. అంతేకాకుండా పదోన్నతులు, నియామకాల్లో కూడా ఈయన అనుకున్న వారికి ఉద్యోగాలు ఇప్పించారని అంటున్నారు. బ్యాంకులో దాదాపుగా 200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నా వీరిని కాదని ఈయనకు కావాలసిన వ్యక్తులను ఔట్ సోర్సింగ్ విధానంలో పోస్టింగులు ఇప్పించారు. వారు బ్యాంకుకు రాకపోయినప్పటికీ జీతాలు వేయిస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకుకు ఇన్‌చార్జి సీఈవోగా పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని బెదిరించి ఉద్యోగుల బదిలీలు చేయించాలని, క్రిమినల్ కేసులో ఉన్న వారికి పదోన్నతులు ఇవ్వాలని వత్తిడి పెడుతున్నారనేది సమాచారం. ఒకే కేసులో నలుగురు ఉద్యోగులు ఉంటే వారిలో ఒకరికి ఒక విధంగా మిగిలిన ముగ్గురికి మరో విధంగా పనిష్మెంటు విధించేలా అధికారులతో చేయించాడంటే ఆయన శక్తి అర్థమవుతుంది. కడప డీసీసీ బ్యాంకులో సలహాదారు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అరాచకాలను జిల్లా సహకార అధికారి, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని చర్యలు తీసుకుని బ్యాంకును కాపాడాలని బ్యాంకు అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

చౌక బియ్యం అక్రమదందా

వైసీపీ ఐదేళ్ల పాలనలో రేషన్‌మాఫీయా చెలరేగిపోయింది. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అడ్డదారుల్లో నల్లబజారుకు తరలించి కోట్లకు పడగలెత్తారు. వైసీపీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో వీళ్ల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇక చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నామమాత్రపు దాడులు చేస్తూ.. వారితో కలసి వాటాలు పంచుకుతింటూ కాలం వెల్లబుచ్చారు. ఈ అక్రమ దందాకు టీడీపీ ప్రభుత్వంలోనైనా అడ్డుకట్ట వేసి ప్రజాధనాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- వైసీపీ అండదండలతో రెచ్చిపోయిన రేషన్ మాఫియా
- రూ.కోట్లకు పడగెత్తిన అక్రమార్కులు
- అధికారుల నామమాత్రపు దాడులు.. ఆపై వాటాలు
- ఇకనైనా అడ్డుకట్టపడేనా!



నామమాత్రపు తనిఖీ చేస్తున్న అధికారులు

మైదుకూరు, జూన్ 19: మైదుకూరు, ప్రొద్దుటూరు కేంద్రాలుగా చౌక బియ్యం అక్రమదందా జరుగుతోంది. దీంతో చౌక బియ్యం పంపిణీలో దాదాపు 60 శాతం పక్కదారిపడుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, అనంతపురం జిల్లాలోని ప్రాంతాల నుంచి కూడా రేషన్ బియ్యం సేకరించే మొత్తం మాఫియా మూలాలు మైదుకూరు, ప్రొద్దుటూరులోనే ఉండటం గమనార్హం. వీళ్లకు వైసీపీ అండదండలు పుష్కలంగా ఉండడంతో ఈ అక్రమదందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. పేదలకు ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని లబ్ధిదారులతో పాటు డీలర్ల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇంకొన్ని చోట్ల ఏకంగా రేషన్ బియ్యం గోదాముల నుంచి మిల్లులకు తరలిస్తూ ఈ అక్రమ దందా నడుపుతున్నారు.

పాలీస్ పట్టడం లేదా... నూకలు చేయడం

మధ్యవర్తులు ఇంటింటికి తిరిగి సేకరించిన చౌక బియ్యాన్ని బస్తాలకు పోసి రాత్రి వేళల్లో కొందరు రైస్ మిల్లులకు తరలిస్తుండగా.. మరికొందరు యంత్రాల ద్వారా నూకలు తయారు చేసి అమ్ముకుంటున్నారు. మిల్లర్లు బియ్యాన్ని పాలిస్‌పట్టి సన్నగా చేసి తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారు. కిలో రూ.15లకు కొనుగోలు చేసి వాటిని సన్నగా పాలిస్ బట్టి దాదాపు రూ.50లకు అమ్ముకుంటున్నారు. మరి కొందరు రేషన్ బియ్యాన్ని నూకలు చేసి హోటళ్లు, టిఫిన్ సెంటర్ల వారికి కిలో రూ.25 నుంచి 30 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు.

ఇంటింటికి తిరుగుతూ కొనుగోళ్లు

రేషన్ బియ్యం ఇంటికి చేరిన వెంటనే.. ఇళ్ల వద్దకు వెళ్లి బియ్యం కొనుగోలు చేసే వారి సంఖ్య వందల్లో ఉంది. మోటరు సైకిళ్లలో ఇంటింటికి తిరుగుతూ కిలో రూ.10 నుంచి 12 రూపాయలు చెల్లించి బస్తాల్లో నింపుకొని ఆటోల్లో మిల్లర్లకు తరలించి కిలో రూ.15తో అమ్ముకుంటున్నారు. ఈ రేషన్ బియ్యం అక్రమార్కులకు డీలర్లు, ఎండీయూ వాహనదారులు సహకారం అందిస్తున్నట్లు సమాచారం.

నామమాత్రపు దాడులు.. ఆపై వాటాలు

ప్రొద్దుటూరు, మైదుకూరు కేంద్రంగా రేషన్ మాఫియా దందాలు సాగిస్తున్నా అధికా రులు మాత్రం నామమాత్రపు దాడులు చేయడం.. ఆపై మిల్లర్ల యజమానులతో వాటలు పంచుకోవడం ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో కొనసాగింది. ఎవరైనా సరిపోని వారు సమాచారం ఇస్తే అక్కడికి వెళ్లడం.. సరుకు లేదనడం లేదా ఒకటి రెండు బస్తాలు పట్టుకుని రెవెన్యూ వారికి అప్పగించడం.. లేదా నామమాత్రపు జరిమా నాలు విధించి చేతులు దులుపుకోవడం జరుగుతోంది.

తాజాగా చూస్తే...

ఇటీవల మైదుకూరు పట్టణంలోని 2 ప్రధాన రైస్‌మిల్లులపై విజిలెన్స్, తూనికల శాఖ అధికారులు దాడులు చేసి రూ.1.75 లక్షలు జరిమానా విధించారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాలు, తూనిక కొలతలశాఖ అధికారులు ముకుమ్మడిగా దాడి చేసి.. బియ్యం బస్తాల నిల్వలు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

బియ్యపు బస్తాలపై ప్యాకింగ్ తేదీలు, వాటి వివరాలు లేవని నిర్ధారించి తూనిక, కొలతల శాఖాధికారులు రూ.75 వేలు, మిల్లుకు సంబంధించి వివరాలతో కూడిన సూచిక బోర్డులు లేవని రూ.లక్ష జరిమానా విధించి వెళ్లి పోవడం గమనార్హం.

విలేజ్ హెల్త్‌సెంటర్‌ను తనిఖీ చేసిన ఢిల్లీ డాక్టర్లు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రేమాన్స్ పాండ్య

చాపాడు, జూన్ 19: మండలంలోని చిన్నగురవలూరు గ్రామంలో విలేజ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ఢిల్లీలోని నేషనల్ క్వాలిటీ అసిస్‌మెంట్ కమిటీ డాక్టర్లు ప్రేమాన్స్‌పాండ్య, సిదార్థతుక్ర తనిఖీ చేశారు. వారు గ్రామస్థులతో మాట్లాడి డాక్టర్లు వైద్యసేవలు ఏ విధంగా మీకు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. స్థానిక డాక్టర్లు అయిన రాజేష్‌కుమార్, ఓబులేసులను అడిగి గ్రామంలోని ప్రజలకు ఎలా వైద్య సేవలు చేస్తున్నారని తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎన్ని మందులు వస్తున్నాయని.. సరఫరా కాని మందుల గురించి ఆరా తీశారు. ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది ఆశా కార్యకర్తల పనితీరును గురించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతి, బాబుల్‌రెడ్డి, మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారికి సహస్ర కలశాభిషేకం



కొలువుదీరిన శ్రీవారు, కలశాభిషేక కార్యక్రమంలో ఆలయ అర్చకులు

కడప (కల్చరల్) జూన్ 19: తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలోని లక్ష్మీవేంకటేశ్వరుని దేవస్థానంలో ఈనెల 19 నుంచి 21 వరకు శ్రీవారికి కలశాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం 5-30 గంటల నుంచి భగవద్వీజ్ఞాపనం, విశ్వక్సేనారాధన, భగవత్పుణ్యాహం, సహస్ర కలశాభిషేక సంకల్పం, రక్షాబంధనం, అంకురార్పణం, వాస్తుయాగం, యాగమంటప ద్వారా తోరణారాధనములు, వేద ప్రబంధ, స్తోత్రపాఠ పారాయణం, అఖండదీప స్థాపనం తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్, కృష్ణమూర్తి, సాయి, తరుణ్ సారథ్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి తనిఖీ



అబ్జర్వర్ సుగుణాన్‌కు డాక్టర్ల వివరాలను చెబుతున్న సూపరింటెండెంట్ మల్లీశ్వరి

పులివెందుల రూరల్, జూన్ 19: కొత్తగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)ని బుధవారం డీఎంఈ, ఎన్ఎంసీ అబ్జర్వర్ సుగుణాన్ తనిఖీ చేశారు. అన్ని విభాగాలకు సంబంధించిన డాక్టర్లు దాదాపు 75 మంది ఇక్కడ వైద్యసేవలు అందించనున్నారు. ఇందులో దాదాపు 400కి పైగా పడకలు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి వచ్చిన డీఎంఈ, ఎన్ఎంసీ అబ్జర్వర్ అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మెడికల్ కళాశాల అనుమతులు పొందాలంటే నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) బృందం తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఎన్ఎంసీ బృందం తనిఖీ చేయాల్సిన సందర్భంగా ముందుగా అబ్జర్వర్ సుగుణాన్ పరిశీలించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, డాక్టర్ విఘ్నేశ్వర్‌రావు తెలిపారు.


వయోవృద్ధులకు రక్షణగా సీనియర్ సిటిజన్ యాక్టు : జడ్జి

కడప(రూరల్) జూన్ 19: వయోవృద్ధులకు రక్షణగా సీనియర్ సిటిజన్ యాక్టు ఉందని... వయోవృద్ధుల పోషణను విస్మరించిన వారికి చట్టపర చర్యలు ఉంటా యని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని చౌడమ్మ వృద్ధాశ్రమాన్ని విజిట్‌చేసి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టం 2007 గురించి తెలియజేశారు. వృద్ధుల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించా రు. వృద్ధులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే డీఎల్ఎస్ఏను సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



రెహమాన్ సాహెబ్ మృతదేహం



రెహమాన్ సాహెబ్ (ఫైల్)

సంబేపల్లె, జూన్ 19: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని గుట్టపల్లి గ్రామం ఎస్.సోమవరం క్రాస్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎస్.అబ్దుల్ రెహమాన్ సాహెబ్ (65) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన అబ్దుల్ రెహమాన్‌సాబ్ కలకడ నుంచి సంబేపల్లె వైపు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రైలు ఢీ.. గుర్తు తెలియని మహిళ మృతి



సిద్దవటం జూన్ 19: మండలంలోని కనుమలోపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గూడ్సు రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈమె వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని.. ఎత్తు 5.5 అడుగులు, చెక్ డిజైన్ కలిగిన టెర్రీకాటన్ చీర, మెడలో ఎరుపు గోల్డ్‌కలర్ కలిగిన పూసల దండ, దానికి ఆంజనేయస్వామి తాయుత్తు కలదు. ఆచూకీ తెలిసిన వారు 9440900811 నెంబ ర్‌కు ఫోన్ చేసి తెలియపరచాలని కడప రైల్వేస్టేషన్ ఎస్ఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



జంగంరెడ్డిపల్లిలో బాధితుల డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

సింహాద్రిపురం, జూన్ 19: జంగంరెడ్డిపల్లిలో గత కొన్ని సంవత్సరాలుగా భూమి తగాదా పరిష్కారం కాకపోవడంతో మనస్థాపంతో అదే గ్రామానికి చెందిన క్రిష్టపాటి కళావతి బుధవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లో కెళితే... జంగంరెడ్డిపల్లిలోని సర్వే నెంబర్ 40లో గత కొన్ని సంవత్సరాల నుంచి క్రిష్టపాటి కళావతి, క్రిష్ట పాటి నడిపి రోసిరెడ్డికి ఒక ఎకరా పొలం సంబంధించి తగా దా నడుస్తోంది. ఈ సమస్యపై కోర్టును సైతం ఆశ్రయించారు. అయితే రోసిరెడ్డి ఎక్స్‌క వటేర్ సాయంతో పొలంలో పనులు చేస్తుండగా ఆ భూమి తమదని కళావతి అడ్డుపడింది. అయినా వినకుండా పనులు అలాగే చేశారు. దీంతో కళావతి మనస్థాపానికి గురై ఇంటికి వచ్చి చీనీ చెట్లకు ఉపయోగించే క్రిమిసంహారక మందును తోట వద్దకు తీసుకెళ్లి అక్కడే తాగింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు 108 సహాయంతో పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం-తహసీల్దార్

భూ వివాదానికి సంబంధించి ఇరువురి మధ్య 20 సంవత్సరాల నుంచి తగాదా నడుస్తోంది. కళావతి అనే మహిళ విషద్రావణం తాగిన సమాచారం తెసిన వెంటనే ఆ గ్రామానికి వెళ్లి ఇరువురిని విచారించి వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించాం. పూర్తిస్థాయి నివేదికను పులివెందుల ఆర్డీఓకు అందజేస్తామని తహసీల్దార్ భీమేశ్వరరావు వివరించారు. ఆర్ఐ షేక్షావలి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కడప నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కడప (మారుతీనగర్) జూన్ 19: పౌర్ణమి సందర్భాన్ని పురస్క రించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో నుంచి ఈనెల 20వ తేదీ గురువారం రాత్రి 8 గంటలకు కడప డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇందులో పెద్దలకు టిక్కెట్ రూ.1050, పిల్లలకు రూ.570గా నిర్ధారించారు. సీట్లు రిజర్వేషన్ చేసుకోదలచినవారు ఆన్‌లైన్ ద్వారా కానీ, లేదా కడప బస్టాండు వద్ద గల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా చేసుకోవాలని డిపో అధికారి డిల్లీశ్వరరావు కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆర్టీసీ బస్సుల వల్ల కలిగే ఇబ్బందులు, సమస్యలు, ఆదాయం పెంచుకోవడానికి సలహాలు, సూచనలకు వీలుగా ఈనెల 20వ తేదీ గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయ ల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. ప్రయాణీకులు ఏదేని సమ స్యలను నివృత్తి చేసుకునేందుకు 9959225774 అనే నెంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల తరలింపును విరమించుకోవాలి

- రాయసీమ విద్యావంతుల వేదిక నేతలు



మాట్లాడుతున్న రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యులు

ప్రొద్దుటూరు, జూన్ 19: ఎన్డీయే కూటమి ప్రభుత్వం కర్నూలు నుంచి ప్రభుత్వ కార్యాలయాలు తరలించే ప్రయత్నాలను విరమించుకోవాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నేతలు మహమూద్, వరలక్ష్మీ, పద్మలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక హోమస్‌పేటలోని సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాయలసీమ ప్రాంతానికి అభివృద్ధిలో ప్రధాన్యత ఇస్తారని సీమ ప్రజలంతా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. అందువల్లే ఎన్డీయే కూటమికి ఈ ఎన్నికల్లో రాయలసీమలో అత్యధిక సీట్లు కట్టబెట్టారన్నారు. కానీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాచమలసీమ హక్కులను విస్మరిస్తూ కర్నూల్ నగరంలో ఏర్పాటు చేసిన మానవహక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్‌బోర్డు కార్యాలయం, ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ అథారిటీ కార్యాలయాలను అమరావతికి తరలించపోవటం సరి కాదన్నారు. ఇది సీమ ప్రజల ఆకాంక్షలపై పిడుగుపాటు లాంటిదన్నారు. అభివృద్ధి అంటే ఒకేచోట అది అమరావతిలోనే కేంద్రీకరించటం కాదని కూటమి ప్రభుత్వం గుర్తెరగాల న్నారు. అభివృద్ధిలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అహేతుకంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కృష్ణా రివర్‌బోర్డును సీమకు తరలించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పోలవరం కంటే ముందు సీమకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇవేవి చేపట్టకుండా సీమ హక్కులను కాలరాసే ప్రయత్నాలు సముచితం కాదన్నారు. గతంలో కేంద్రం అనంతపురం జిల్లాకు కేటాయించిన సంస్థలను గుంటూరు జిల్లా మంగళగిరికి తరలించడాన్ని ఇక్కడి ప్రజానీకం ఇంకా మరిచిపోలేదన్నారు. అభివృద్ధి కేంద్రీకరణ ప్రాంతాల మధ్య విభేదాలకు దారి తీస్తోందని తెలంగాణ అనుభవాలను మరిచిపోవద్దన్నారు. వెం టనే కర్నూలులోని ప్రభుత్వ కార్యాలయాల తరలింపు ప్రతి పాదనలను విరమించుకోవాలని కోరుతున్నామన్నారు. సీమ ప్రజలు కూటమి ప్రభుత్వంపై వుంచిన నమ్మకాన్ని నిలుపు కోవాలన్నారు. రాయలసీమ ప్రజాప్రతినిధులు ఈ తరలింపు చర్యలపై నిరసిస్తూ ప్రజల పక్షాన గొంతువిప్పాలన్నారు. సమావేశంలో రాయలసీమ మహిళాశక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, విద్యార్థిశక్తి కన్వీనర్ హరిత, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణలు పాల్గొన్నారు.

బాబోయ్ దొంగలు...

- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు
- అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎమ్ఎస్



ప్రశాంతినగర్‌లో చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడవేసిన దుస్తులు


పులివెందుల టౌన్, జూన్ 19: తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో పులివెందుల పట్టణంలో చోరీలను పరిశీలిస్తే అన్నీ తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయి. గత కొద్ది రోజులుగా పులివెందుల పట్టణంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. పట్టణంలోని ప్రశాంతినగర్‌లో అల్లాబకాష్ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న బీరువాలు పగులగొట్టి అందులో ఉన్న 28తులాల బంగారు, రూ.40వేలు నగదు చోరీకి గురైంది. గత కొద్ది రోజుల నుంచి పట్టణంలో పగలు, రాత్రి తేడా లేకుండా తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరిగాయి. నేరుగా తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీలకు పాల్పడుతున్నారు. వీటిలో అత్యధిక శాతం చోరీలు జరిగిన ప్రదేశాలు పరిశీలిస్తే పట్టణం నడిబొడ్డున చోరీలు జరగడం విశేషం. దీనిని బట్టి చోరీలకు పాల్పడిన తర్వాత సులువుగా తప్పించుకొని వెళ్లేందుకు వీలుగా ముందుగా రెక్కీలు నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లమవుతోంది.

అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎమ్ఎస్

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణ ఉండే విధంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎమ్ఎస్) ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు ముందస్తుగా సమాచారం అందిస్తే ఆ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ జరిగే ది. గతంలో ఈ పద్ధతి ద్వారా కొంతమేర ఫలితాలు వచ్చాయి. ఇపుడు పూర్తిగా అటకెక్కింది. రాత్రి సమయాలలో పోలీసుల గస్తీ కూడా అంతంతమాత్రంగానే ఉంటుందన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో గస్తీలకు బ్లుకోల్ట్ టీంలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ టీంల జాడే కనిపించలేదు. ఈ నేప థ్యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చోరీలకు పాల్పడుతుండడంతో చోరీలు అధికమయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మరింత నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

హ త్యా...ప్రమాదమా?

- చెన్నూరు వద్ద హైవేలో ఛిద్రమైన మృతదేహం
- సంఘటనపై అనుమానం వ్యక్తం చేస్తున్న స్థానికులు



మృతుని ఆధార్‌కార్డు

చెన్నూరు, జూన్ 19 : చెన్నూరు వద్ద జాతీయరహదారిపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఓ వ్యక్తి శరీరం ఛిద్రమై కనిపించింది. అయితే ఇతన్ని ఎవరైనా హత్య చేశారా, లేక రోడ్డు ప్రమాదమా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మృతుడు మండలంలోని కనుపర్తి గ్రామానికి చెందిన భూమిరెడ్డి నారాయణరెడ్డి (38)గా గుర్తించారు. ఇతను నిత్యం మద్యం సేవించేవాడు. చెన్నూరులో అతని సోదరి నివాసం ఉంటోంది. కాగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతుడు నారాయణరెడ్డి బాగా మద్యం తాగి ఆ ప్రాంతంలో ఉన్నాడని, అయితే తెల్లవారేసరికి శవమై కనపించాడు. అయితే గుర్తుపట్టలేని విధంగా మృతదేహం ఛిద్రమైపోయింది. దీంతో అతన్ని ఎవరైనా హత్య చేశారా లేక మద్యం మత్తులో వాహనాల కింద పడ్డారా అన్న నుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. పోలీసులు మాత్రం ఇది ప్రమాదం అయి ఉండవచ్చు అనే కోణంలో విచారిస్తున్నామని చెబుతున్నారు. కాగా, మృతదేహం దగ్గరలో ఓ సిమెంటు దిమ్మె రక్తంతో ఉండడం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. మృతున్ని సిమెంటు దిమ్మెతో తలపై మోది చంపి రోడ్డుపై వేశారా లేక చంపిన తరువాత వాహనాల కింద పడేశారా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. ఆ కోణంలో కూడా విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటనలో అనుమానితునిగా ఉన్న మృతుని బంధువును స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు తెలిసింది.

తీరు మారలేదు..

- మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో జగన్ ఫొటో
- టీడీపీ నేతల ఆగ్రహం.. కమిషనర్‌కు ఫిర్యాదు



మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో ఉన్న జగన్ ఫొటో, కమిషనర్‌తో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

రాజంపేట, జూన్ 19: ప్రభుత్వం మారినా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను రాజంపేట మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో అలాగే పెట్టడం తగదని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ ఫొటోను తొలగించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేత ఫొటో పెట్టడంలో అర్థమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా అన్నక్యాంటీన్‌ను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఉన్న అన్నా క్యాంటిన్‌లో ఇంకా సచివాలయం కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే అన్నా క్యాంటిన్‌లో ఉన్న సచివాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి క్యాంటిన్‌ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, టీడీపీ నాయకుడు గంప శివ, కౌన్సిలర్ సుధాకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మైనార్టీ నాయకులు గుల్జార్‌బాషా, అబూబకర్, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'సికిల్ సెల్' రక్తహీనతపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

రాయచోటి టౌన్, జూన్ 19: సికిల్ సెల్ రక్తహీనతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో బాలికలకు సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ రక్తహీనత లక్షణాలు, చికిత్స నివారణ, నియంత్రణ గురించి అవగాహన కల్పించారు. సికిల్ సెల్ వ్యాధి ఉన్న వారిలో ఎర్ర రక్తకణాలు త్వరగా నశించి రక్తహీనతకు దారి తీస్తుందన్నారు. తద్వారా అనేక రుగ్మతలకు గురవుతారని, పౌష్టికాహారంతో పాటు సమతుల ఆహారం తీసుకోవడం, వ్యాయామం ద్వారా వ్యాధి రాకుండా రక్షణ పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీస్ సూపరింటెండెంట్ సురేశ్, ప్రిన్సిపాల్ బి.లత, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇసుక కుంభకోణంపై విచారణ : ఆర్డీఓ

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 19: వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట ముందు జరిగిన రూ.600 కోట్ల ఇసుక కుంభకోణంపై విచారణకు ఆదేశిస్తూ ఆర్డీఓ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందం రవిశంకర్‌రెడ్డి నాయకత్వంలో 2019 నుంచి 24 వరకు జరిగిన కుంభకోణం మీద వినతి పత్రం ఇచ్చి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్డీఓ 624/2024 రెఫరెన్స్ ప్రకారం తక్షణమే విచారణ జరపాలని తెలిపినట్లు తెలిపారు. ముగ్గురు (మైనింగ్, పోలీసు, రెవెన్యూ) అధికారులతో త్రీమెన్ కమిటీ వేసి విచారణ చేసి జరిగిన అవినీతిని, అక్రమాలని గుర్తించాలని అందుకు కారణమైన వారిపైన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కుంభకోణంలో పాల్గొన్న ఇసుక కంపెనీ, అధికారులు, నేతలు, ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయాలని కోరారు.

ముగిసిన భగవాన్ రామగిరిబాబా ఆరాధనోత్సవాలు



భక్తులకు అన్నదానం చేస్తున్న బీజేపీ నేతలు కందుల, గోసుల

కడప (కల్చరల్) జూన్ 19: నగర 40వ డివిజన్ భవానీనగర్‌లో వెలసిన భగవాన్ రామగిరిబాబా ఆలయ గురుపూజ, ఆరాధన మహోత్సవాలు 15వ తేదీ శనివారం నుంచి 19వ తేదీ వరకూ కన్నుల పండువగా నిర్వహించా రు. రామగిరిబాబా సేవా సమితి ఛైర్మన్ రాజభాస్కర్ షిండే ఆధ్వర్యంలో ఐదు రోజులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చివరి రోజు బుధవారం బీజేపీ రాష్ట్ర నేత కందుల మురళీమోహన్‌రెడ్డి, సీనియర్ నేత గోసుల శ్రీనివాసులురెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి సేవలో తరించి మాట్లాడారు. మహిమాన్వితుడైన భగవాన్ రామగిరిబాబాను దర్శించుకోవడం పట్ల చాలా సంతోషంగా వుందన్నారు. తదనంతరం స్వామివారి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సుబ్బయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులేసు, కేశవ, భక్తులు, అర్చకులు సురేష్ పాల్గొన్నారు

టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి



హోంమంత్రి అనితను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీటెక్ రవి, మహేశ్వరరెడ్డి

చక్రాయపేట/పులివెందుల టౌన్, జూన్ 19: టీడీపీ కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి వినతి పత్రం సమర్పించారు. బుధవారం హోంమంత్రి అనితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ కార్యకర్తలపై అనేకమార్లు అక్రమంగా కేసులు నమోదు చేశారని వాటిని ఎత్తివేయాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని కోరారు. చక్రాయపేట మండలంలో అనేక సమస్యలను హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పులివెందుల పరిస్థితులు, పలు అంశాలు బీటెక్ రవిని హోంమంత్రి అడిగారు. ఇందుకు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హోంమంత్రి తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్లటూరులో పుత్తా చైతన్యరెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే చైతన్యరెడ్డికి దేవునిపటాన్ని అందిస్తున్న టీడీపీ నేతలు

కడప(ఎర్రముక్కపల్లె), జూన్ 19: కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ నేతలు నాగమల్లారెడ్డి, అంజలి సుబ్బారెడ్డి, సురేంద్రారెడ్డి, మైనూరారెడ్డి, చంద్రబాబురెడ్డి, మునిరెడ్డి, ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దేవునిపటాలను ఆయనకు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉన్నత మార్గం వైపు యువత దశ దిశ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ చింతా సుధాకర్ తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 19: సమాజంలో జరుగుతున్న సంఘటనలను అర్థం చేసుకుని ఉన్నతమైన మార్గం వైపు పయనించే యువత ఎప్పుడూ విజయపథంలో పయనిస్తాడని వైవీయూ వీసీ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. కథారచయిత జ్యోతి జార్జి రచించిన 'అనుకోని అతిథి' పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థి లక్ష్య సాధనకు ప్రేమ వ్యవహారాలు అవరోధంగా నిలుస్తాయన్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు రచయిత జార్జి తన కథలో అక్షర రూపం ఇచ్చారన్నారు. రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా యువత అడుగులు వేస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి, విశాంత్ర తెలుగు భాషోపాధ్యాయులు డాక్టర్ వెల్లాల వెంక టేశ్వరచారి, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబులు రచయిత జార్జిని అభినందించారు.

చెన్నూరు నాగలింగేశ్వరాలయానికి కొత్త సొబగులు

● భక్తుల సహకారంతో గర్భగుడులకు గోపురాలు ఏర్పాటు



చెన్నూరు నాగలింగేశ్వర ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు

చెన్నూరు, జూన్ 19: భక్తుల సహకారంతో చెన్నూరు నాగలింగేశ్వరాలయం కొత్త శోభను సంతరించుకోనుంది. మండల వ్యాప్తంగా భక్తులు అందిస్తున్న ఆర్థిక సాయంతో ఆలయం పునర్ వైభవానికి సిద్ధమవుతోంది. దాదాపు 500 ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఆలయంలోని నాగలింగేశ్వరుడు, లలితాంబదేవి ఉత్తరముఖంతో భక్తులకు దర్శనం ఇస్తుంటారు. గతంలో ఓ వెలుగు వెలిగిన ఈ ఆలయం తరువాత కాలంలో నిరాదరణకు గురైంది. అయితే ఇటీవల ఆలయానికి మరింత శోభ తెచ్చేందుకు, కొత్తకాంతులతో విరాజిల్లేందుకు చెన్నూరుకు చెందిన యువత, పెద్దలు కమిటీగా ఏర్పడ్డారు. గ్రామ ప్రజల ఆర్థిక సహకారంతో ఆలయంలో గర్భగుడి, గోపురాలు, మండపానికి కొత్త శోభలు, గ్రానైట్ ఏర్పాటు, మంటపంపై విగ్రహాలు తదితరాలు చేపట్టారు. రాజమండ్రికి చెందిన శిల్పులచే ఈ పనులు చేపట్టారు. ఇప్పటికే అటు నాగలింగేశ్వరుడి గర్భగుడికి, లలితాంబ గర్భగుడిపై గోపురాలు ఏర్పాటు చేశారు. మండపం పైకప్పు వర్షానికి ఉరవకుండా తయారు చేయడం, కింద గ్రానైట్ ఏర్పాటు, గర్భగుడి గోడలకు, లోపల గెలాక్సీతో ఏర్పాటు చేయడం లాంటి పనులు చేపట్టారు. భక్తులు ఆలయ పునర్ వైభవానికి ఆర్థిక సహకారాన్ని అందిస్తుండడం, మరికొందరు గుడి అభివృద్ధిలో ఒక్కో భాగానికి తమ వంతుగా రూ.50వేల నుంచి లక్ష వరకు విరాళం అందిస్తున్నారు. నాలుగైదేళ్లగా ఈ ఆలయంలో నిత్యం పూజాది కార్యక్రమాలు, కార్తీక మాసంలో ప్రత్యేక అభిషేకాలు, మహాశివరాత్రి నాడు అత్యంత వైభవంగా పూజలతో పాటు ప్రతి సోమవారం, శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు జరిపిస్తున్నారు. ఆలయ అభివృద్ధిలో భక్తులు ఈశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, మరికొందరు కీలకమయ్యారు. ఆలయానికి ముందు వైపు నవగ్రహ మండపం, రాతి ధ్వజస్తంభం, రేకులతో కల్యాణోత్సవ మండపం కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టారు. పైగా ఆలయానికి వాయువ్యభాగంలో ఉన్న వ్యాపార గదులను పూర్తిగా తొలగించారు. దీంతో ఆలయం సువిశాలంగా తయారైంది. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన పనులు సాగిస్తున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుత్తా చైతన్య జన్మదిన వేడుకలు

రక్తదాన శిబిరం విజయవంతం ● అన్నదానం, దుస్తుల పంపిణీ చేపట్టిన అభిమానులు

శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, న్యాయవాదులు



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి - కడప నగరంలో పేదలకు బిర్యానీ అందిస్తున్న మాజీ సర్పంచ్ రామన శ్రీలక్ష్మి - చెన్నూరు ఎస్టీకాలనీలో దోమతెరలు, బెడ్‌షీట్లు పంపిణీ చేస్తున్న ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 19: ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పుట్టిన రోజు వేడుకలు అభిమానుల మధ్య వేడుకగా నిర్వహించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం ఆవరణలో అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి పంచారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. టీడీపీ కార్యాలయం అభిమాన సందోహం మధ్య కిటకిటలాడింది. ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పుత్తా యల్లారెడ్డి, పీఈటీలు శంకర్‌రెడ్డి, సునీల్, తిరుపాల్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం చేశారు. పురుషుల, మహిళల వాలీబాల్ కబడ్డీ పోటీలు ఫైనల్ పోటీల్లో విజేత జట్టుకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. టీడీపీ యువనేతలు పుత్తాలక్ష్మిరెడ్డి పుత్తా సాయినరసింహారెడ్డి ప్రారంభించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి వారిని అభినందించి, ప్రశంసాపత్రం అందించారు. టీడీపీ యువనేత ఖాదర్ బాషా, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, జంపాల నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీసీ నేతలు గోపాల్ యాదవ్, శంకర్‌యాదవ్, దాది రామయ్య, సుబ్బరాయుడు, యాదవ్, రమణ, సీమోన్, నబీ రసూల్, సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, చెన్నారెడ్డి, రాఘవరెడ్డి, కరీం అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విందు భోజనం

చెన్నూరు, జూన్ 19: మండల వ్యాప్తంగా ఎమ్మెల్యే పుత్తా చైతన్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొక్కిరాయపల్లెలో మాజీ ఎంపీటీసీ చింతకుంట వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు విందు భోజనం ఏర్పాటు చేశారు. సర్పంచ్ సూర్యనారాయణ, ఎస్సీ సెల్ నేత రాంప్రసాద్, సీనియర్ నేతలు పర్వతరెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి పాల్గొన్నారు. రామనపల్లెలో యువనేత పుత్తా సాయి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు భవానీ ఆచారి, మణికంఠ పాల్గొన్నారు. రామనపల్లె మాజీ సర్పంచ్, రాష్ట్ర అటవీశాఖ మాజీ డైరెక్టరు రామన శ్రీలక్ష్మి, చంద్రమోహన్‌రెడ్డి దంపతులు కడప నగరంలో పేదలకు బిర్యానీ, దుస్తులు అందించారు. తెలుగుయువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్ కుమార్‌రెడ్డి చెన్నూరు ఎస్టీ కాలనీ వాసులకు దోమతెర, బెడ్‌షీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. యువనేతలు సుంకేసుల వెంకటసుబ్బయ్య, ఓబులేసు, ఎస్సీ, ఎస్టీ నేతలు సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో....

వీరపునాయునిపల్లె, జూన్ 19: కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య జన్మదిన వేడుకలు టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల టీడీపీ రైతు అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్.పాలగిరి మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌రెడ్డి, గోపీనాథరెడ్డి, పవన్ కృష్ణ అనాథలకు పండ్లు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేని కలిసిన అధికారులు, ప్రముఖులు

కడప(రూరల్) జూన్ 19: స్థానిక టీడీపీ కార్యాలయంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డిని పంచాయతీరాజ్ అధికారులు, న్యాయవాదులు, టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకి జడ్పీ పరిపాలనా అధికారి ఖాదర్‌బాషా, కడప డివిజనల్ అధికారి మస్తాన్‌వల్లి, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఏపీపీ గంగిరెడ్డి శివశంకర్‌రెడ్డి, కడప మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గంధం మోహన్‌బాబు, కడప టీడీపీ నేత ఆరిఫుల్లా శుభాకాంక్షలు తెలిపారు.

రాహుల్ నాయకత్వం దేశానికి అవసరం : తులసిరెడ్డి



వృద్ధులకు అన్నదానం చేస్తున్న పుల్లయ్య

వేంపల్లె, జూన్ 19: ప్రస్తుత పరిస్థితుల్లో అటు దేశానికి, ఇటు కాంగ్రెస్ పార్టీకి రాహుల్ గాంధీ నాయకత్వం ఎంతో అవసరమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, మాజీ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ 54వ పుట్టిన రోజును కాంగ్రెస్ నేతలు వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థులు పూల నజీర్, బ్రహ్మానందరెడ్డి, పుంగనూరు అసెంబ్లీ ఇన్‌చార్జి సింగం రామకృష్ణారెడ్డి, సయ్యద్ సలాఉద్దీన్, రామకృష్ణ, అమర్, రమేష్, బాలెం సుబ్బరాయుడు, ఆరుశేర్ల సుబ్బరాయుడు, వేమయ్య, బాబు, వినయ్, రఫీక్, నాగరాజు, రవి, బద్రి, మాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక విభాగం ఆధ్వర్యంలో అన్నదానం

కడప(కలెక్టరేట్) జూన్ 19: రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య ఆధ్వర్యంలో ఆదరణ నిరాశ్రయుల గృహంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమలో టాక్సీ యూనియన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ హబీబుల్లా, జిల్లా అధ్యక్షుడు శివ, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మామిళ్ల బాబు, వెంకటసుబ్బయ్య, యశ్వంత్, మహిళా నాయకురాళ్లు లావణ్య, లక్ష్మీదేవి, శ్రీహ రి, ఆదరణ నిర్వాహకులు విజయకుమార్ పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, భావిభారత ప్రధాని, రాహుల్ గాంధీ నేటి తరానికి గొప్ప నాయకుడని కాంగ్రెస్ నేత అఫ్జల్ ఖాన్ కొనియాడారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీఖాన్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్, కాంగ్రెస్ నేతలు ఆనంద్ కుమార్, నరసింహులు, గంగయ్య, మహిళా నాయకురాలు గౌరీ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ మధుసూదన్‌రెడ్డి

పులివెందుల, జూన్ 19: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తొండూరు మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆర్‌బీకేల్లో ఉన్న ఎరువులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 40 టన్నులు 14- 35-14 (బస్తా రూ.1700), 26టన్నులు 28-28-0 (రూ.1700), 15 టన్నులు 20-20-0-13 (బస్తారూ.1250), 44టన్నులు యూరియా (బస్తా రూ.266.50), మదూరు ఆర్‌బీకేలో 5.65టన్నుల డీఏపీ (బస్తా రూ.1331) అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

22న పుస్తకావిష్కరణ

కడప (ఎడ్యుకేషన్), జూన్ 19: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 22న విద్వాన్ కేవీ రమణారెడ్డి రచించిన 'ప్రజ్ఞాన ప్రకాశిక' పుస్తకం ఆవిష్కరిస్తున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు తెలిపారు. సంస్థతో పాటు జిల్లా రచయితల సంఘంతో కలిసి నిర్వహిస్తున్న పుస్తకావిష్కరణలో భాగంగా అదే రచయిత రాసిన గీర్వాణి, జలకం గీతాంజలి పుస్తకం పరిచయం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సికెదిన్నె, జూన్ 19: ప్రజలు వైద్యాధికారులు అందించే ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సోషియల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం సుగాలి బిడికిలో బుధవారం సికిల్‌సెల్ అనిమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన చేపట్టిన ఆమె మాట్లాడుతూ రక్తహీనతతో ఏర్పడే వివిధ సమస్యలపై వివరించారు. వైద్యాధికారులు రాఘవేంద్ర, సునీత మాట్లాడుతూ ఈ వ్యాధి జన్యు పరమైన కారణాలతో వస్తుందన్నారు. రక్తకణాలు కొడవలి ఆకారంలో ఉండి శరీరానికి కావాల్సిన ఆక్సిజన్ అందించలేని స్థితిలో ఉంటాయని ఫలితంగా రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ప్రజలు తక్కువ ఖర్చుతో స్థానికంగా ఆయా కాలాల్లో పండే పండ్లు, కూరగాయలతో సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుకుమారి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ విగ్రహం తొలగించండి'

కడప (ఎడ్యుకేషన్), జూన్ 19: వైవీయూలో వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం వైవీయూలో వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్‌కు వినతి పత్రం అందించిన ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా యూనివర్సిటీలు ఉండాలని యూనివర్సిటీలో ఏ రాజకీయ నేతల విగ్రహాలు ఉండడానికి వీలు లేదన్నారు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతల విగ్రహాలు పెట్టడం వల్ల యూనివర్సిటీలు రాజకీయాలకు నిలయాలుగా మారతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నేతలు తిరుమలేశ్, చంద్ర, లోకేశ్, శ్రీకృష్ణ, ఫరీద్ పాల్గొన్నారు.

కడప నగరాభివృద్ధికి సహకరించండి

సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే మాధవి



సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే మాధవీ, శ్రీనివాసరెడ్డి, శ్రావణ్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 19: కడప నగరం అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మాధవి సీఎం నారా చంద్రబాబునాయుడును కోరారు. బుధవారం విజయవాడ సీఎం పేషీలో మర్యాదపూర్వకంగా జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కుమారుడు శ్రవణ్ రాజ్‌రెడ్డితో ఆమె కలిశారు. కడప నగరానికి సంబంధించిన సమస్యలను సీఎం దృష్టికి తెచ్చారు. అలాగే అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

'యూనివర్సిటీల ప్రక్షాళన చేపట్టాలి'



విలేకరులతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత అంకన్న

కడప (ఎడ్యుకేషన్), జూన్ 19: రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్లలో యూనివర్సిటీల్లో రాజకీయ జోక్యంతో ఆయా వ్యవస్థలు పతనావస్థకు వచ్చాయని, వైవీయూ పరాకాష్టకు చేరిందని వెంటనే ప్రక్షాళన చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి స్వార్థంతో యూనివర్సిటీలను వాడుకున్నాడని, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రూ.200 కోట్ల వరకు అక్రమంగా సంపాదించాడని ఆరోపించారు.



నీటిని వెంటనే తొలగించాలి : సీపీఐ



రోడ్డుపై నిలిచిన నీటిని చూపుతున్న సీపీఐ నేతలు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 19: 48వ డివిజన్ హోమియోపతి కళాశాల రోడ్డులో వర్షం నీటిని తొలగించాలని సీపీఐ నేత మునెయ్య డిమాండ్ చేశారు. పరమేశ్వర స్కూలు రోడ్డుపై నిలిచిన వర్షం నీటిని చూపిస్తూ హోమియోపతి కాలేజీ వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షానికి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆయన వివరించారు. డ్రైనేజీ నిర్మాణం అశాస్త్రీయంగా చేయడంతో వర్షం నీరు వరద కాల్వలోకి వెళ్లకుండా రోడ్డుపైనే నిలిచి ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే జరిగిందని దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వరద కాల్వ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. సీపీఐ నేతలు దస్తగిరి, సంతోశ్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

కడప (క్రైం), జూన్ 19: కడప నగరం రాజీవ్ మార్గ్ వద్ద ఇద్దరు యువకుల నడుమ ఘర్షణ తలెత్తడంతో పరస్పరం కత్తులతో దాడులకు ఎగ్గబడ్డారు. ఒకడు మరొకరిని కత్తితో పొడిచి పరారీ అయ్యాడు. గాయపడిన వ్యక్తిని రిమ్స్‌కు తరలించారు.

విద్యుత్ పొదుపు తప్పనిసరి : ఎంఈఓ



ఇంధన పొదుపుపై అవగాహన చేపడుతున్న ఎంఈఓ గంగిరెడ్డి

చెన్నూరు, జూన్ 19: జరుగుతున్న కాలంలో విద్యుత్ పొదుపు ఇంధన పొదుపు తప్పనిసరని ఎంఈఓ గంగిరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం విద్యార్థులకు విద్యుత్ ఇంధన పొదుపుపై అవగాహన నిర్వహించారు. మనిషి జీవితంలో విద్యుత్ ప్రధాన భాగమైంది కాబట్టి దాన్ని పొదుపుగా వాడాలని సూచించారు. ప్రకృతి నుంచి వచ్చే ఎండ (సౌరశక్తి), గాలి (పవన శక్తి)లను ఉపయోగించుకోవాలన్నారు. ఫలితంగా భవిష్యత్తులో బొగ్గునిల్వలు నీటి వనరులు తగ్గినా సమస్య రాకుండా ఉంటుందన్నారు. ఇప్పుడు ఎక్కువగా నీటి ద్వారా (హైడ్రోపవర్), బొగ్గు ద్వారా విద్యుత్ వాడకం జరుగుతుందని, ఇది మానవునికి ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సహజ వనరులు ఉపయోగించుకుని వాడుకోవాలని తద్వారా డబ్బు ఆదా చేయవచ్చన్నారు. ప్రతి ఇంటా సోలార్ వాడకం తప్పని సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజోలిని మన హద్దులోకి తీసుకొస్తా

● ప్రతి ఎకరాకు నీరు పారించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి ● నీటిపారుదల శాఖాధికారులతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు, జూన్ 19 : ప్రస్తుతం రాజోలి రిజర్వాయర్ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పరిధిలో ఉంది. సీఎం చంద్రబాబుతో మాట్లాడి మన పరిధిలోనికి తీసుకవచ్చి రిజర్వాయర్ నిర్మించి తెలుగుగంగ, కేసీ కెనాల్ ద్వారా చెరువులను నింపడంతో పాటు ప్రతి ఎకరాకు నీరు పారేలా ఒక నెల లోపు ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. కడపలో బుధవారం సాయంత్రం ఎస్ఈ వెంకట్రామయ్య, సీఈ మల్లికార్జున, ఈఈ క్రిష్ణారెడ్డి, ఈఈలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రహ్మంసాగర్‌తో పాటు సబ్సిడరీ రిజర్వాయర్ల ద్వారా వెళ్లే పంట కాలువల ఆక్రమణలు గుర్తించాలని, అన్ని చెరువులకు స్లూయూజ్, గేట్లు ఏర్పాటు చేయాలని, అలాగే ఏమైనా లీకేజీలు ఉంటే వాటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కేసీ కాలువ, తెలుగు గంగ ద్వారా ప్రతి చెరువులకు నీళ్ళు నింపేలా అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, వాటి నిర్మాణ పనులుంటే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అలాగే అళ్ళగడ్డ పరిధిలో ఉన్న రాజోలి రిజర్వాయర్ నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి మైదుకూరు పరిధిలోకి తీసుకవచ్చి రిజర్వాయర్ పనులు వేగవంతం చేస్తామని, ప్రతి ఎకరాకు నీళ్లు పారేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న పుట్టా సుధాకర్‌యాదవ్

ప్రతి గ్రామంలో శ్మశానాల పరిరక్షణ...: గ్రామానికి శ్మశానం ముఖ్యమని, మైదుకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో శ్మశాన నిర్మాణానికి స్థల సేకరణ ప్రహరీ వాటి సౌకర్యాలపై నివేదికలు ఇవ్వాలని ఆయా మండల తహసీల్దార్లను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశించారు. బుధవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల రోజులలోపు నివేదికలు ఇవ్వాలని కోరారు.

22న చండీ హోమం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 19: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో 22వ తేదీ శనివారం చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం 6 గంటలకు చండీ హోమం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గోవధను అరికట్టాలి

ప్రొద్దుటూరు , జూన్ 19 : ప్రొద్దుటూరులో యథేచ్ఛగా జరుగుతున్న గోవధ ను అధికారులు వెంటనే అరికట్టాలని గోసంరక్షణ సమితి అధ్యక్షుడు శివనాగిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు సాయినాధరెడ్డికి గోసంరక్షణ కమిటీ వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని బొల్లవరం పెద్దగుంత ఎల్ఐసీ కార్యాలయం దగ్గర, మదర్‌థెరిస్సా ఆశ్రమం సమీపంలో గోవధ బహిరంగంగా జరుగుతోందన్నారు. అంతేకాకుండా పట్టణంలో మాంసం దుకాణాల వద్ద జంతువులను ఇష్టానుసారంగా వాటిని రోడ్లపై వధిస్తూ రక్తం ఇతర వ్యర్థాలను కాలువల్లో వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడువంకదార నరేంద్ర, బీజేవైఎం నేత రాఘవేంద్రరెడ్డి, శేషన్న, దశబందం బాబు తదితరులు పాల్గొన్నారు.


29న జాతీయ లోక్ అదాలత్

బద్వేలు, జూన్ 19: హై కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 29వ తేది బద్వేలు జరుగనున్న లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని బుధవారం బద్వేలు కోర్టు పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్‌ల సిబ్బంది,డీఎస్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ ,జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి మాట్లాడుతూ వివిధ రకాల కేసులలో ఉన్న వారికి లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

బద్వేలు, జూన్ 19: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీపాళెంలోని ప్రభుత్వ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు బుధవారం తిరుమల ట్రస్ట్ వారి సహకారంతో విద్యాసామగ్రిని అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీఐ శేఖర్‌రావు, ఎంఈవో చెన్నయ్య, వ్యవసాయ మార్కెట్‌యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న వయసు నుంచే కష్టపడి చదవడంతో పాటు ఆధ్యాత్మికంగా సేవాభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కేవీ.సుబ్బారావు, పెద్ది మెస్వేర్ సుధాకర్,షేక్ దాదాపీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి



సూచనలిస్తున్న డీఈవో

అట్లూరు, జూన్ 19 : ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో అనూరాధ సూచించారు. బుధవారం కస్తూర్బా గురుకుల పాఠశాలను పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలో ఆరో తరగతి 40 సీట్లు పరిమితి ఉండగా 80దరఖాస్తులు వచ్చాయని, ఇంటర్మీడియట్‌కు 40 సీట్లు ఉండగా 86 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె ఆమె తెలిపారు. విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విలియంరాజు, ఎంఈవో2 ఖాదర్‌వలి, కేజీబీవీ ప్రత్యేక అధికారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండికోట నుంచి మైలవరానికి 400 క్యూసెక్కుల నీటి విడుదల

కొండాపురం, జూన్ 19: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.మైలవరం పరివాహక ప్రాంతంలో తాగునీటి అవసరాల దృష్ట్యా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు నీటిని వదులుతున్నట్లు డీఈ తెలిపారు.కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 2.498 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనమే

ప్రొద్దుటూరు , జూన్ 19 : మాదకద్రవ్యాలకు అలవాటు పడితే యువత భవిష్యత్తు అంధకారమౌతుందని స్పెషన్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో సీఐ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారంనారాయణ జూనియర్‌కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్, ఏజీఎం, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియా వ్యాధిని నిర్మూలించాలి

ప్రొద్దుటూరు, జూన్ 19 : సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు పాటు పడాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం డాక్టర్ శశిభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోన కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పెద్దశెట్టిపల్లె హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్ ఫోర్స్ టీం పరిశీలించారు. కార్యక్రమంలో టీం సభ్యులు డాక్టర్ రమేష్ రెడ్డి, ఎస్‌వో అరుణ కుమారి, నారాయణ, వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ సూపర్‌వైజర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: మండలంలోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దీపిక ఆధ్వర్యంలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మోరగుడిలో ర్యాలీ జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సికిల్‌సెల్ అనిమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం గురుకుమార్, సీసీ ఎలిజర్, రాధా, శంకర్, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ముబీన్ సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధి వంశపార్యంపర్యం వస్తుందని, రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపురంగులోకి మారడం, తీవ్రమైన వళ్లనొప్పులు, కీళ్లనొప్పులు, శ్వాసతీసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సిబ్బంది అరుణకుమారి, శోభన్‌బాబు, క్రిష్ణప్రియ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కాశినాయన,జూన్19: ఓబుళాపురం సమీపంలోని సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో బుధవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బద్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ది విజయజ్యోతి ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్‌చేసి వృద్ధులకు పండ్లు, స్వీట్ పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అన్వర్ బాష బీ.కోడూరు అధ్యక్షుడు గురప్ప, కలసపాడు నాయకులు చిన్నరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలి

జమ్మలమడుగు, జూన్ 19: ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని సీపీఐ కార్యదర్శి మిడుతూరు ప్రసాద్ డిమాండ్ చేశారు. జమ్మలమడుగు మండలం లేక మైలవరం మండలాల్లో గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్టీల్‌ప్లాంట్ నిర్మించేందుకు శిలాఫలకాలు వేయడం జరిగింది, అప్పట్లో స్టీల్‌ప్లాంట్ పనులు జరుగలేదన్నారు. ప్రస్తుతం ఏర్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని, ఉక్కు సాధన ఉద్యమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కృషి చేయాలన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 19: ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎన్జీవో అసోసియేషన్ ప్రొద్దుటూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌లను వారి వారి కార్యాలయాల్లో ఎన్జీవో అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ ప్రెసిడెంట్ సదాశివయ్య, ఉపాధ్యక్షులు శివరామానుజ, మధుసూదన్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరి రాజశేఖర్, మాజీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాగార్జున, మహేశ్వరయ్య, నాయక్, వెంకటరామయ్యపాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

పోరుమామిళ్ల, జూన్ 19 : పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో వరప్రసాదరావు, స్పెషల్ ఆఫీసరు చంద్రశేఖర్, తహసీల్దారు శిరీషా అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత వానాకాలంలో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సీజన్‌లో మురుగు కాల్వలను శుభ్రం చేయడం,గుంతల్లో నీరు లేకుండా చేయడం, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.తాగునీరు పైపులైను లీకేజీలు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందితే కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులరెడ్డి,ఖాసింపీరా, నారాయణ బాబు, వెంకటయ్య పాల్గొన్నారు.

వర్షం నీరు కాలువలోకి వెళ్లేలా చర్యలు

ప్రొద్దుటూరు ,జూన్ 19 : నాలుగు గ్రామాలకు వెళ్ళే రహదారిలో వర్షం నీళ్లు నిలబడుతూ ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతూ వున్న వైసీపీ నేతలు పట్టించుకోలేదని పంచాయతీ మాజీ కో-ఆప్షన్‌సభ్యుడు బోనం గురివిరెడ్డి ఆరోపించారు. బుధవారం రైల్వే బ్రిడ్జి సమీపంలో రోడ్డు మీద నీళ్ళు నిలబడకుండా కాలువలోకి మళ్లించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దొరసానిపల్లె అరవ మునివర తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించండి

కొండాపురం, జూన్ 19: 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అంగన్‌వాడీ వర్కర్లు కోరారు. బుధవారం మండలంలోని కొండాపురం-5,ఓబన్నపేట-2 అంగన్‌వాడీ కేంద్రాలలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమంలో భాగంగా పిల్లలు,తల్లిదండ్రుల చే ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతి,రాణి పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరును పునరుద్ధరించడం హర్షణీయం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 19: విదేశీ విద్యకు అంబేడ్కర్ ఓవర్‌సీస్ విద్యానిధిగా తెలుగుదేశం ప్రభుత్వం పేరు మార్చడం అభినందనీయమని దళిత సైన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలిపోతుల సుదర్శన్ పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం విదేశీ విద్యాపథకానికి జగన్ పేరు మార్చి ఆ పథకాన్ని నిర్వీర్యం చేసి దళితులకు ఉన్నత విద్యను దూరం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పునరుద్ధరించి చంద్రబాబునాయుడు ఎస్సీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

24న గదికి వేలంపాట

ఎర్రగుంట్ల, జూన్ 19: ఎర్రగుంట్లనగరపంచాయతీకి చెందిన గదిని అద్దెకు ఇచ్చేందుకు 24తేదీ ఉదయం 11గంటలకు నగరపంచాయతీ కార్యాలయంలో వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామక్రిష్ణయ్య తెలిపారు. నెలబాడుగ రూ.1350గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ బాడుగకు జీఎస్టీ అదనంగా ఉంటుందని వేలంపాటలో పాల్గొనే వారు వేయిరూపాయల రుసుముతో రూ.5000 (తిరిగి ఇవ్వబడని) గుడ్‌విల్‌తో పాల్గొనాలని తెలిపారు.

'ఆరోపణలు చేయడం సరికాదు'

జమ్మలమడుగు, జూన్ 19: జమ్మలమడుగులో తమ సిబ్బందిలో తానంటే గిట్టనివారు, వాళ్ల చెప్పినట్లు వినలేదని అనవసరంగా తనను ఎన్నికల నిధులు దుర్వినియోగం చేశానని అవినీతి జరిగిందని తనపై పలువురు ఆరోపణలు చేస్తున్నారని ఇది సరికాదని తహసీల్దారు కరుణాకర్ వెల్లడించారు. బుధవారం జమ్మలమడుగులో తహసీల్దారు విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బడ్జెట్ కోటీ రూ.62 లక్షలు మంజూరైందన్నారు. పోలింగ్ బూత్‌లు, సిబ్బందికి రూ.56 లక్షలు ఖర్చు పెట్టామన్నారు. ఇంకా కొంత మంది చేసిన ఖర్చుల బిల్లులుఇవ్వాల్సి ఉందన్నారు. ఆ డబ్బుల ఖర్చులు, బిల్లులు తీసుకుని రావాలని కోరడం జరిగిందన్నారు. దీంతో కొందరు వ్యతిరేకంగా తనపై అనవసరంగా బిల్లులు వాడుకున్నట్లు, అవినీతి జరిగిందని, ఇలా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా చేసిన ఖర్చులకు బిల్లులు తెచ్చి డబ్బు తీసుకుని వెళ్లవచ్చని ఆయన తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని సత్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 19: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ శాఖ బోర్డును పునరుద్ధరించడానికి కృషి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యేసోబు పేర్కొన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటకృష్ణ, సహాయ కార్యదర్శులు నాయబ్‌రసూల్, సత్యరాజు, సుబ్బరాయుడు, సుమన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



పేద మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న వీఎస్ ముక్తియార్

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 19: స్థానిక గోకుల్‌నగర్‌కు చెందిన ఆరిఫున్ కుమార్తె వివాహానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ ఆర్థికసాయం అందజేశారు. ఆరిఫున్ భర్త కరోనా సమయంలో మృతిచెందాడు. ఆయన కుమార్తెకు వివాహం చేసే ఆర్థికస్థోమత లేకపోవడంతో ఆమె తనకు సాయం చేయాలని టీడీపీ నాయకులను కోరింది. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వీఎస్ ముక్తియార్, ప్రజాసేవా సమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ఆ మహిళకు రూ.20 వేలు ఆర్థికసాయంతోపాటు పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మన ప్రజాసేవా సమితి అధ్యక్షుడు బీటెక్ బాష, గౌరవాధ్యక్షుడు అరబ్‌షా, కోశాధికారి మహమూద్, సహాయకార్యదర్శి మహేష్, రాజేష్, రాజేంద్ర, యూసఫ్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి పారిశుధ్యకార్మికుల వినతి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి మొరపెట్టుకుంటున్న కార్మికులు

ప్రొద్దుటూరు, జూన్ 19 : జిల్లాప్రభుత్వ ఆసుపత్రిలో ఐదు నెలలుగా జీతాలు లేవు ఇప్పించండని పారిశుధ్యకార్మికులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలోని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని కాంట్రాక్టు పారిశుధ్యకార్మికులు కలిసి తమ బాధలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా కాంట్రాక్టరు బాల నాగిరెడ్డి జీతాలు చెల్లించపోవడంతో తమ పరిస్థితి దారుణంగా వుందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి వెంటనే కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డికి ఫోన్‌చేసి మాట్లాడాడు. నాలుగు రోజుల లోపు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని కాంట్రాక్టరు తెలిపినట్లు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు, జూన్ 19 : నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రొద్దుటూ రులోని నివాసంలో ఉన్న ఆయనను వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో ఆయన అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. అర్ధంతరంగా ఆగి పోయిన రోడ్లు, భవనాలు ఇతర వాటి పనులను అడిగి తెలుసుకున్నారు. పనులు చేసేందుకు కృషి చేయాలని, నియోజకాభివృద్ధి కోసం కష్ట పడతానని, ఇక మీదట పనులు చేసిన వాటికి బిల్లులు ఇప్పించే బాధ్యత తనదని అధికారులతో పుట్టా పేర్కొన్నారు. ఎమ్మెల్యే పుట్టాను కలసిన వారిలో వివిధ శాఖల అధికారులు మల్లేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, మధుసూదనరావు, ఏఈలు ఉన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

చాపాడు, జూన్ 19: మండలంలోని భద్రిపల్లె గ్రామంలో బుధవారం రాత్రి అవధూత వీరయ్యస్వామి ఉత్సవాల్లో మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు. స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. వీరయ్యస్వామికి కుంకుమార్చన, పుష్పాలంకరణ, కలశపూజ వంటి పూజలు చేశారు. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు కూడా దైవదర్శనం చేసుకున్నారు. మహిళలు కోలాటం, తాళాల భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, ఆ గ్రామ సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి, టీడీపీ నాయకులు గుత్తి వీరనారాయణ, పెరుగునారాయణ, మేకల బాబు, వెంకటసుబ్బారెడ్డి, సుదర్శన్, నాగరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో నిండిన నాపరాళ్ల గనులు

● పనిలేక ఇబ్బందుల్లో కార్మికులు



దేవగుడి-సుగుమంచిపల్లె గ్రామాల మధ్య గనులు వర్షపునీటితో నిండి ఉన్న దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 19: జమ్మలమడుగులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీటితో గుంతలు నిండాయి. జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో నాపరాళ్ల గనులు భారీ వర్షాలకు నిండి నిండుకుండలా మారాయి. మండలంలోని దేవగుడి, పి. సుగుమంచిపల్లె గ్రామాల మధ్య నాపరాళ్ల గనులు వర్షపునీటితో నిండడం వలన వారం రోజుల నుంచి గని కార్మికులకు పనులు లేక అల్లాడుతున్నట్లు వాపోతున్నారు. అలాగే మైలవరం మండలం దొమ్మరనంద్యాల, పొన్నతోట గ్రామ పంచాయతీల మధ్య ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో గని కార్మికులకు ఉపాధి కరువైంది. అదే విధంగా జమ్మలమడుగు పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీ ఆవరణం, పెద్ద ఎల్ఎంసీ హైస్కూలు ఆవరణం, ముద్దనూరు రోడ్డులోని పలు చోట్ల గుంతలు నిండాయి.

ప్రధానరోడ్డులో డ్రైనేజీ లేక ప్రజల అవస్థలు

ముద్దనూరు జూన్19:ప్రధాన రోడ్డులో డ్రైనేజీ లేక ప్రజలు అవస్థలు పడతున్నారు. వర్షపు నీరు రోడ్డు పైనే ప్రవహించడంతో పాటు గుంతలు ఉన్న చోట వర్షపు నీరు నిలుస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే...పేరుకే ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ కానీ ఇక్కడ నివాసం ఉండే వారికి సరైన సదుపాయాలులేవు.ముద్దనూరుకు ప్రధాన కూడలి పాత బస్టాండు. ఈ రోడ్డులో వ్యాపార సముదాయాలు,నివాసాలు ఉన్నారు.నాలుగు రోడ్ల కూడలి నుంచి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల వరకు డ్రైనేజీ లేదు.భారీ వర్షం పడితే నీరు రోడ్డుపై ప్రవహించి పాత బస్టాండు మీదుగా వెళతుంటాయి.అంతేకాకుండా రోడ్డు ప్రక్కన ,రోడ్డు పైన గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో వాహనాలు వస్తే బురద నీరు నడుచుకుంటూ వెళ్లే ప్రజలపై పడుతుంది.ఈ రోడ్డు నేషనల్ హైవేకి సంబంధించి ఉన్న అభివృద్ధి దిశగా పట్టించుకునే అధికారులులేరు. బైపాస్ రోడ్డు ఏర్పాటు చేశామని నేషనల్ హైవే అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు